www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 17 ఆగస్టు 2024

అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.50 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్న క్యాంటీన్లు పునఃప్రారంభమైన నేపథ్యంలో మదనపల్లె పట్టణంలోని విష్ణు జ్యువెలర్స్ నిర్వాహకులు అనిల్, విష్ణు వారి కుటుంబ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు రూ.50 వేల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అనిల్, విష్ణు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్ల పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు కేవలం రూ.5లకే మంచి భోజనం లభిస్తోందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో తాము భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ఇక మదనపల్లి పట్టణంలోని రెండు అన్న క్యాంటీన్లు ఎమ్మెల్యే షాజహాన్ బాషా నేతృత్వంలో దిగ్విజయంగా నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు.



ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న అనిల్, విష్ణు

భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రతి సోమవారం కలెక్టర్లు నిర్వహించే ప్రజాఫిర్యాదుల వ్యవస్థలో 90 శాతం రెవెన్యూ సమస్యలే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని అనేక గ్రామాల్లో ఏళ్ల తరబడి భూసమస్యలు పేరుకుపోయి ఉన్నాయి. అధికారులు సకాలంలో జోక్యం చేసుకుని పరిష్కరించడంలో విఫలం కావడంతో కోర్టు కేసులతో కునారిల్లుతున్న నేపథ్యం కనిపిస్తోంది. ఫలితంగా ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. భూసమస్యల అపరిష్కృతం కారణంగా జిడిపిలో రెండు శాతం కోతపడుతోంది. ఫలితం దేశాభివృద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉంటే వారు తమ అనుచరులకు వత్తాసు పలుకుతూ భూసమస్యల్ని జటిలం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల కడప, అన్నమయ్య జిల్లాల్లో అసైన్డ్, ఇనామ్, ఇతర భూముల ఆక్రమణలు అధికంగా ఉండడంతో ప్రత్యేక విచారణాధికారులను నియమించిన నేపథ్యంలో కథనం..

కబ్జా కోరలు తొలగేనా!

భూ వివాదాల్లోనే గ్రామసీమలు
త్వరలో రెవెన్యూ సదస్సులు
రెవెన్యూ అస్తవ్యస్త ఫలితమే

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ప్రభుత్వం ఇటీవల అసైన్డ్ భూమి 99, 843 ఎకరాలు, ఫ్రీ హోల్డ్ 76,321 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో అసైన్డ్ భూములు 1,41,478 ఎకరాలు, ఫ్రీహోల్డ్ 1,62,442 ఎకరాలు ఉన్నట్లు గుర్తించిన సంగతి తెలిసిందే. వేలాది ఎకరాల ఇనామ్ భూములు ఆక్రమణల్లో ఉన్నాయని, వీటి పరిష్కారానికి ప్రత్యేక విచారణాధికారులతో విచారించాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల్లో ఏమేరకు పరిష్కారం లభిస్తుందో చూడాలి. ఇందుకు అనుగుణంగా మంత్రి డోలా వీరాంజనేయులు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించి కార్యాచరణ నడుంబిగించిన సంగతి తెలిసిందే. భూసమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలతో సమానంగా పట్టణ కేంద్రాలు భూఆక్రమణలకు కేరాఫ్ అడ్రస్గా నిలిచాయి. రెవెన్యూ, సర్వే అధికారులు సరైన నిర్ణయాలు తీసుకోని ఫలితమే ఇవన్నీ. ఫలితంగా జిడిపిలో రెండు శాతం కుంగుబాటు కనిపిస్తోందనే వాదన వినిపిస్తోంది. ఇటీవల కలెక్టర్ లోతేటి శివశంకర్ మీడియాతో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల వ్యవస్థకు వచ్చే ఫిర్యాదుల్లో 90 శాతం సరిహద్దులు, కొలతల్లో వ్యత్యాసాల సమస్యలే ఉన్నాయని, వీటి పరిష్కారానికి ఎటు వైపు నుంచి నరుక్కురావాలో అర్థం కావడం లేదని, ఒకవేళ లోపాల్ని గుర్తించి చెప్పినా దక్కు మొత్తు ఉన్నాయనే పేరుతో పేచీకి దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కడప జిల్లాలోని కడప, బద్వేల్, అన్నమయ్య జిల్లాలో మదనపల్లె ప్రాంతాలు భూ ఆక్రమణలకు నిలయాలుగా మారాయి. పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే స్థానిక రాజకీయ నాయకులు ఆక్రమణల పర్వం పతాక స్థాయికి చేరుకుంది. సాగు భూములు రియల్ఎస్టేట్ వ్యాపారానికి కేరాఫ్ అడ్రస్గా మారడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, 36 మండల కేంద్రాల అత్యధిక ప్రాంతాల పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల్లో వెంచర్లు దర్శనమిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వీటిని కొనుగోలు చేసిన ప్రజానీకం బాధితులుగా మారుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితుల నేపథ్యంలో కొనుగోలు చేసిన ప్రజానీకం తీవ్రంగా నష్టపోతోంది. ఇటువంటి అక్రమ వెంచర్లను గుర్తించిన కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ రూ.కోట్లపై జరిమానాల్ని విధించింది. ఇటువంటి రియల్ ఎస్టేట్ కబంధహస్తాల బారిన పడ కూడదనే ఉద్దేశంతో వెంచర్లు ఏర్పాటు చేసి నిర్వాహకులు సైతం పూర్తి చేస్తోంది. ఎక్కడైనా ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేయడం పరిపాటిగా మారింది. గతప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కొందరు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యం బహిరంగ రహస్యం. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలాల్లో తాజాగా పక్కా గృహాలు నిర్మించుకున్న ప్రజలు, పాత లబ్ధిదారుల పేరుతోనే ఇళ్లు ఉండడంతో వాటిని మార్పు కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె భూఆక్రమణల వ్యవహారం పెద్దపెత్తున వెలుగులోకి రావడం తెలిసిందే. మదనపల్లె భూఆక్రమణల కేసును ప్రభుత్వం సిఐడికి బదిలీ చేయడం తెలిసిందే. ఇందులో ఇద్దరు ఆర్డీఓ స్థాయి ఉన్నతాధికారులు సస్పెన్షన్కు గురి కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

వడ్డెరలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం వడ్డెర కులస్తులకు అన్ని విధాల అండగా ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అజయ్ ఫంక్షన్ హాల్‌లో వడ్డెర విద్యావంతుల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరలకు గతంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు. వడ్డెరల హక్కుల సాధనకు తాను ముందు ఉంటానని వారి హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూసుకుంటామని పేర్కొన్నారు. వడ్డెరలు అన్ని రంగాల్లో కూడా వెనుకబడి ఉన్న మాట వాస్తవమని వారిని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడానికి తెలుగుదేశం ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వడ్డెర్లకు ఎక్కడ ఇబ్బంది కలిగిన వాటిని పరిష్కారం చేయడానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. రాయచోటిలో మొట్టమొదటిగా వడ్డెరలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో తమ కుటుంబం ముందు వరుసలో ఉందని రాయచోటి మున్సిపాలిటీ మొట్టమొదటి చైర్మన్‌గా వడ్డెర కులానికి చెందిన డేరంగుల వీరభద్రయ్యను చేసిన ఘనత తమ కుటుంబానికి దక్కుతుందని గుర్తు చేశారు. 90 శాతానికి పైగా వడ్డెరులందరూ తనకు ఓటు వేశారని నా గెలుపులో వారు భాగస్వాములు అయినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెరలకి దక్కాల్సిన క్వారీలు పెత్తందారుల చేతుల్లో ఉండిపోతున్నాయని వడ్డెరలకు దక్కడం లేదని వారికి తీరని అన్యాయం జరుగుతున్నదని విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు లీగల్ అడ్వైజర్ టి.ఈశ్వర్ సదస్సులో ప్రస్తావించగా ఇందుకు స్పందించిన మంత్రి మండిపల్లి ఏ క్షణంలోనైనా సరే ఎక్కడ అన్యాయం జరిగినా తాను అందుబాటులో ఉంటానని ఆ సమస్యల పరిష్కారానికి ముందు ఉంటానని హామీ ఇచ్చారు. న్యాయవాది టి.ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 50 లక్షల జనాభా ఉన్న వారిలో 80 శాతం మంది అన్ని రకాల నిర్మాణాలలో పాల్గొంటూ వెలకట్టలేని శ్రమ చేస్తున్నప్పటికీ 175 ఎమ్మెల్యేలలో ఒక్క వడ్డెర లేకపోవడం బాధ కలిగించే విషయమన్నారు. విద్యామంతులు వేటగాం గౌరవ అధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ మనదేశంలో తెలుగు రాష్ట్రాలలో తప్ప ఇతర రాష్ట్రాలలో వడ్డెరలు ఎస్సీ, ఎస్టీలుగా ఉన్నారని దీనితో ఆయా రాష్ట్రాలలో వడ్డెరల ప్రాతినిధ్యం అన్ని రంగాలలో ఉందని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో కూడా వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి జరుగుతున్న వడ్డెర్ల ఉద్యమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరో పులివెందుల లాంటి రాయచోటిలో రాంప్రసాద్‌రెడ్డి గెలవడం అందులోనూ మంత్రి కావడం మన అదృష్టమని పేర్కొన్నారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తన తండ్రికి మున్సిపల్ చైర్మన్‌గా అవకాశమిచ్చింది మండిపల్లి కుటుంబమేనని అందుకే ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా వడ్డెరలకు అన్ని రంగాలలో కూడా ప్రాతినిధ్యం ఇవ్వాలని అప్పుడే వడ్డెర జాతి అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విద్యావంతులు వేదిక నాయకుడు కోటేశ్వరరావు అధ్యక్షత వహించి విద్యావంతుల వేదిక ఇప్పటివరకు వడ్డెరల కోసం ఇతరుల కోసం చేసిన ఉద్యమాలను గురించి వివరించారు. కార్యక్రమంలో కడప వార్త రమణ, సర్పంచ్ వాసు, న్యాయవాది నాగముని, కోటకొండ రవి, వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మారుతి శంకర్, జీవానందం, ఉపాధ్యక్షులు ,చల్లా రెడ్డయ్య కుంచపు రెడ్డయ్య, బండల శీను, విజయనగరం రామకృష్ణ, నూలివీడు నాగేశ్వరరావు, శివ ప్రసాద్ విడగొట్టు నాగేశ్వరరావు, దుద్యాల శంకర్, హరినాథ్ దేవరాజ్, ఎల్ఐసి చిన్నప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డెర కుల సంఘ పెద్దలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి గజమాలతో ఘనంగా సన్మానించారు.

మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

- ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్‌లను ప్రారంభించినట్లు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శుక్రవారం మదనపల్లె పట్టణంలోని మార్కెట్ యార్డు, సంత గేటు వద్ద అన్న క్యాంటీన్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆహారం దొరకక ఎట్టి పరిస్థితుల్లో పస్తులుండకూడదనే గొప్ప ఆశయంతో అన్న క్యాంటీన్‌లను ప్రారంభించామని పేర్కొన్నారు. పేదల కడుపు నింపేందుకే కేవలం రూ.ఐదులకే భోజనాన్ని అందించే బృహత్తర కార్యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తలపెట్టడం శుభ పరిణామన్నారు. పేదల నోటికాడ కూడును పీకేసిన చరిత్ర గత ప్రభుత్వానిదైతే ప్రజలకు పట్టెడన్నం పెట్టే బృహత్తర కార్యాన్ని చేపట్టడం టిడిపి కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మదనపల్లె టమోటా మార్కెట్ యార్డుకు సుదూర ప్రాంతాల నుంచి ఎంతో మంది రైతులు వస్తుంటారని, వీరితోపాటు ఇక్కడ ఎంతో మంది కూలీలు పనులు చేసుకుంటూ జీవనం చేస్తున్నారని వారందరికీ కేవలం రూ.ఐదులకే టిఫిన్, భోజనం, డిన్నర్ మూడుపూటల కలిపి రూ.15లకే అందిస్తూ వారి కడుపు నింపే కార్యక్రమం చేపట్టడం మనసుకు ఎంతో ఆనందాన్నిస్తోందని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లో శుచి, శుభ్రత, నాణ్యతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఒక్క పూట భోజనం రూ.ఐదుకు అందిస్తూ పేదల కడుపు నింపే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మొదటి రోజు ఏ విధంగా నాణ్యమైన భోజనాన్ని అందించామో ప్రతీరోజు ఇలానే అందించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. ప్రతి క్యాంటీన్లోనూ ఉదయం 350 మందికి, మధ్యాహ్నం 350 మందికి, రాత్రి 350 మందికి ఇలా రెండు క్యాంటీన్‌ల ద్వారా 2100 మందికి ప్రతీరోజు నాణ్యమైన భోజనాన్ని అందించే ఏర్పాటు చేస్తామన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు, కూలీలు, మార్కెట్లకు వచ్చే రైతులు ఈ క్యాంటీన్ లను ఉపయోగించుకొని ఆకలి తీర్చుకోవాలని కోరారు. అనంతరం క్యాంటీన్‌లో భోజనాన్ని రుచి చూసిన ఎమ్మెల్యే పలువురికి వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టిడిపి నాయకులు నాదెళ్ళ విద్యాసాగర్, షంషీర్, నాగూర్ వల్లి, జనసేన నాయకులు శ్రీరామ రామ రామాంజులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నిస్సార్ అహ్మద్

లక్షల ఎకరాలు కొల్లగొట్టేందుకు ప్రణాళిక

- వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారత ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో లక్షల ఎకరాల వక్ఫ్ బోర్డు ఆస్తులను కొల్లగొట్టేందుకు ప్రణాళిక రచించిందని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని మదనపల్లె వైసిపి ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక బెంగళూరు రోడ్డులోని తన ఫామ్ హౌస్‌లో ఏర్పాటు చేపిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు అంశాల ఆధారంగా ఆస్తులకు రక్షణ కరువైందన్నారు. గతంలో వక్ఫ్ బోర్డు ఆస్తుల సమస్యలను ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి పరిష్కరించుకునే వారమని, అక్కడ న్యాయం దొరక్కపోతే హైకోర్టును, ఆ తర్వాత సుప్రీం కోర్టును ఆశ్రయించే న్యాయం పొందే వెసులుబాటు ఉండేదని పేర్కొన్నారు. అయితే 2024 వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు ప్రకారం ఆస్తులపై కలెక్టర్‌కు సర్వాధికారాలు ఇస్తున్నారని దీని వల్ల వక్ఫ్ ఆస్తులకు రక్షణ కరువవుతుందన్నారు. భారత దేశంలో 9.50 లక్షల ఎకరాల వక్ఫ్ బోర్డు ఆస్తులు ఉన్నాయని, వాటిలో ఇప్పటికే సగం ఆస్తులు అన్యాక్రాంతమైనట్లు తెలిపారు. తాజాగా ప్రభుత్వం తీసుకుంటున్న సవరణ బిల్లు ప్రకారం ఆస్తులకు రక్షణ కరువు అవుతుందన్నారు. సవరణ బిల్లు ప్రకారం కలెక్టర్ ఇచ్చిన అధికారాలను రద్దు చేయాలన్నారు. మునుపటిలాగే ట్రిబ్యునల్, హైకోర్టు, సుప్రీం కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందే అవకాశం కల్పించాలని ఆస్థుల పరిరక్షణకు వక్ఫ్ బోర్డు కమిటికి విస్తృత అధికారం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్‌డిఎతో జత కట్టిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, మైనార్టీ సంరక్షణ బాధ్యత తాను తీసుకుంటానన్న విషయాన్ని గుర్తు చేశారు. మైనార్టీలకు భరోసాగా ఉంటామంటూ ప్రకటించిన చంద్రబాబు నాయుడు, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాష మైనార్టీ ఆస్తుల పరిరక్షణపై పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి నాయకులు గుండ్లూరు రఫిక్ అహ్మద్, సలీం, యూనిస్, హబీబ్, ఎన్ ఎండి నూర్ మొహమ్మద్ ఖాన్, మొహమ్మద్ యాసీన్ పాల్గొన్నారు.

పీలేరు సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన హబీబ్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా డాక్టర్ షేక్ హబీబ్ బాష శుక్రవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. 2021 ఏప్రిల్ ఒకటవ తేదీన మొదట ఆయన సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు చేపట్టారు. వ్యక్తిగత అవసరాలరీత్యా 2023 అక్టోబర్ 4 నుంచి 2024 ఆగస్టు 15 వరకు సెలవులో ఉన్నారు. ఉప సర్పంచ్ షేక్ జీనత్ షఫీ ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా వ్యవహరించారు. సెలవులో ఉన్న హబీబ్ బాష శుక్రవారం స్థానిక ఎంపిడిఒ ఉపేంద్రరెడ్డిని కలిసి తన సెలవును రద్దు చేసుకుని తాను బాధ్యతలు చేపట్టేందుకు అనుమతి కోరుతూ వినతి పత్రం సమర్పించారని, ఇందుకు ఎంపిడిఒ కూడా అనుమతి ఇచ్చారని, సర్పంచ్‌గా మళ్లీ బాధ్యతలు తీసుకున్న హబీబ్ చెప్పారు. పంచాయతీ కార్యాలయానికి వచ్చిన సర్పంచ్‌కు వార్డు సభ్యులు, మిత్రులు, బంధువులు ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం సర్పంచ్ మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పథకాలతో పాటు ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వ పథకాలను కూడా పాలకమండలి సహకారంతో అమలు పరుస్తూ పంచాయతీ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తన వంతు కృషి అందిస్తానన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనాథ్‌రెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, పిక్కా వెంకటరమణ, నాగభూషణం, మహబూబ్ బాష, అబిద్, ఉదయ్ కుమార్, తదితర సభ్యులతో పాటు వైసిపి మండల మాజీ అధ్యక్షులు నారే వెంకటరమణా రెడ్డి, మైనార్టీ నాయకులు జీలానీ సాహెబ్, ఆనంద్, తారాజాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్

మంచాలమ్మ గుడిలో మంత్రి పూజలు

ప్రజాశక్తి-రాయచోటి

రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం సంబేపల్లి మండలం నారా యణరెడ్డిపల్లెలోని మంచాలమ్మ గుడిని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రికి గ్రామ పెద్దలు, ప్రజలు ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి భక్తిశ్రద్ధలతో ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ మండపం అర్చకులు వేదాశ్వీర్వచనం చేసి మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మంత్రి 'మండిపల్లి'ని కలిసిన చిన్న

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగుదేశం పార్టీ రాజంపేట యువ నాయకులు గుణకల చిన్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని శుక్రవారం రాయచోటిలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాజంపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని ఈ సందర్భంగా మంత్రిని కోరినట్లు గుణకల చిన్న తెలియజేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు టిడిపి మహిళా నాయకులు కుసుమకుమారి, దగ్గుబాటి రవి పాల్గొన్నారు.

'విశ్వం' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని విశ్వం యుపి హైస్కూల్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ స్టూడెంట్ సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టిపల్లి సాయికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వం స్కూల్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులు కావాల్సిన మౌలిక సదుపాయాలు, గ్రౌండ్, క్వాలిఫై టీచర్స్, మెజర్మెంట్స్‌కు సరిపడ తరగతులు గదులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యా శాఖ అధికారులు ఉన్నా పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం డిఇఒ జోక్యం చేసుకొని విశ్వం యుపి స్కూల్‌పై నిబంధనలు ఏవి పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐఒటి, పిఎల్‌సిలపై సర్టిఫికెట్ కోర్సులు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబర్ మొదటి వారం నుంచి నూతన సర్టిఫికెట్ కోర్సులు (ఐఒటి (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్), పిఎల్‌సి (ప్రోగ్రామబుల్ లాజికల్ కంట్రోల్) ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్సులలో చేరేందుకు ఐటిఐ, ఇంటర్మీడియట్, డిప్లమా, డిగ్రీ, బీటెక్ చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు. సర్టిఫికెట్ కోర్సు కాలవ్యవధి 45 రోజులని చెప్పారు. ఈ కోర్సులను రాయచోటి పాలిటెక్నిక్ కళాశాలలో ఎపి స్టేట్ టెక్నికల్ బోర్డు వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు ఎపి స్టేట్ టెక్నికల్ రోడ్డు వారి నుంచి సర్టిఫికెట్ అందిస్తామని పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్ కోర్సు ఫీజు రూ.1500గా నిర్ణయించామని తెలిపారు. పైన తెలిపిన కోర్సులపై మరిన్ని వివరాల కోసం బుజ్జి బాబు (8985126520), లక్ష్మీనారాయణ (7995279315)లను సంప్రదించవచ్చని ప్రిన్సిపల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పేద విద్యార్థులతో కనకదాస ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

పేద విద్యార్థులకు 'కనకదాస' ట్రస్ట్ చేయూత

- వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పరంధామ గౌడ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆరుగురు నిరుపేద పారా మెడికల్ విద్యార్థులకు కనకదాస చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.10 వేలు స్కాలర్‌షిప్ ట్రస్ట్ వ్యస్థాపక చైర్మన్ డాక్టర్ పరందామ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డురాకూడదని, పేద విద్యార్థులకు మా ట్రస్ట్ ఎపుడు సహాయ, సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు తమకు అందివచ్చిన అవకాశాలను చక్కగా సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తమ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో వీటిని మరింత విస్తృతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జి.వి.రమణ, వెంకప్పకోట మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ట్రస్ట్ కో-ఆర్డినేటర్ రామాంజనేయులు, నాగరాజు, విద్యార్థులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు

- టిడిపి జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు అపోహలు అవసరం లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం మొట్టమొదటి సారిగా రెండు అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవం చేసిన సందర్భంగా ఆయన సందర్శించారు. అనంతరం రాజంపేట పార్లమెంటు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, కష్టకాలంలో అండగా నిలబడ్డ ప్రతి ఒక్కరికి గుర్తింపు తో పాటు పదవులు లభిస్తాయిని స్పష్టం చేశారు. ఇందుకోసం వినూత్న పద్ధతుల ద్వారా సరైన స్థానంలో సరైన వ్యక్తిని పెట్టడం కోసం, నిస్వార్ధంగా పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వడం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని కష్టానికి తగిన గుర్తింపు, పదవులు లభిస్తాయిని భరోసా ఇచ్చారు. పార్టీలో అంతర్గత విభేదాలు లేవని సమన్వయంతో ముందుకు సాగుతామన్నారు. జిల్లాలో మొట్ట మొదటిసారిగా పార్టీలో పదవులు కలిగిన వారికి ఆహ్వానం, ప్రాధాన్యత లేదని విమర్శలు గుప్పుమన్నాయని, ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేసిన అనంతరం జిల్లా అధ్యక్షుడు వాటిని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన అనంతరం పేదల పక్షపాతిగా మారిపోయారని ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా పేదల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్లకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. చెప్పిన హామీ మేరకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతోందని, ఒకటో తారీకునే ఇటు పెన్షన్లు అటు ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నట్లు గుర్తుచేశారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు, ఇటీవల జరిగిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రానికి నిధుల వరద పారిందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చే ప్రక్రియ వేగంగా అమలు జరుగుతొందన్నారు. పెన్షన్లు పెంపు ప్రారంభం కాగా అన్న క్యాంటీన్లు ప్రారంభోత్సవం మరింత శుభపరిణామమన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పార్టీ విజయం కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు గౌరవం ఇవ్వడం జరుగుతుందని ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని వెల్లడించారు. రానున్న రోజుల్లో సూపర్ సిక్స్ పథకాలు జిల్లా మంత్రి పర్యవేక్షణలో మరింత ప్రతిష్టాత్మకంగా అమలు కానున్నాయన్నారు. యాదగిరి దొరస్వామి నాయుడు మాట్లాడుతూ కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు పార్టీ విధేయులుగా సేవలు అందించాలని పార్టీ కోసం శ్రమించిన వారి సభ్యత్వాలు పరిశీలించి న్యాయం చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు భవాని ప్రసాద్, మండల అధ్యక్షులు దేవరింటి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్ ఖాన్, హెూటల్ శంకర్, అరుణ్ తేజ్, ప్రణయ్ రాయల్, కాశీ శ్రీరామ్ వాల్మీకి, మల్లెం ప్రకాష్ నాయుడు, పసుపులేటి శ్రీనివాసులు, మహబూబ్ ఖాన్, సికిందర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

'అమూల్' మూసివేసే ఆలోచనను విరమించుకోవాలి

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

రాయలసీమ జిల్లాలలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్న పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్న అమూల్ డెయిరీని మూతవేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని శనివారం మదనపల్లిలో అమూల్ డెయిరీ వద్ద పాడి రైతులు చేపట్టిన ఆందోళనకు ఎఐటియుసి అన్నమయ్య జిల్లా సమితి సంపూర్ణ సంఘీభావం, పాడి రైతులకు అండగా ఉంటుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు ఎక్కువ ధర ఇచ్చి పాలను కొంటున్న అమూల్ డెయిరీని మూసివేయాలని ప్రయత్నిస్తే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. గతంలో పాడి రైతులకు లీటర్ పాలుకు రూ.37 నుండి రూ.43 చెల్లిస్తుండగా ప్రయివేట్ డెయిరీలు మాత్రం కేవలం రూ.27ల నుంచి రూ.33లే చెల్లిస్తూ పాడి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. పాడి రైతుల మద్దతుతో లాభాల్లో నడుస్తున్న అమూల్ డెయిరీ మూసివేసి ప్రయివేట్ డెయిరీలకు ప్రయోజనం చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన విరమించుకోవాలని కోరారు. అమూల్ డెయిరీని మూసివేస్తే పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్న రైతాంగం నష్టపోతారని రైతులకు అండగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు డెయిరీ యజమానులకు అనుకూలంగా చేసే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని సూచించారు.

మంత్రి రాంప్రసాద్ రెడ్డితో మాజీ ఎంపిపి శ్యామల కాంతారావు

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-కలకడ

పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధికి సహకరించాలని మాజీ ఎంపిపి శ్యామల కాంతారావు వివిధ శాఖల మంత్రులకు విన్నవించినట్లు తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలు, అక్రమాలను వెలికి తీయాలని, భూ కబ్జాలు చేసిన వారిపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మంత్రులను కలిసిన వారిలో కోన ఎంపిటిసి కుమారి చంద్రమోహన్, మాజీ సర్పంచ్ త్యాగరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

33/11కెవి లైన్లకు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమంతో పాటు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు పనులు చేపట్టనున్న కారణంగా శనివారం బ్రాహ్మణపల్లె, యస్.అర్ పాలెం, ఆకేపాడు, కట్టకిందపల్లి, హెచ్.చెర్లోపల్లి, తాళ్ళపాక, వత్తలూరు, కొండ్లోపల్లి, బావికాడపల్లి సబ్ స్టేషన్ పరిదిలోని గ్రామాల్లో ఉదయం "తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు డిఇఇ సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతారాయానికి వినియోగ దారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి ముత్తు మారెమ్మ జాతర

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన ముత్తు మారెమ్మ జాతర ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త స్వామి ఏలుమలై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17నవిశేష పూజలు, 18న జాతర, 19న పాల పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలి

ప్రజాశక్తి-రామాపురం

దేశవ్యాప్తంగా మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి నంద్యాల సరోజనమ్మ, మర్రి సుమిత్రమ్మలు డిమాండ్ చేశారు.మండల కేంద్రమైన రామాపురంలో మహిళలపై జరుగుతున్న వేదింపులను అరికట్టాలని నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజూ ఏదో ఒక రూపంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి 78వ సంవత్సరాలైనా పసి పిల్లల నుంచి వృద్ధ మహిళల వరకు వేదింపులు జరుగుతూనే ఉన్నాయని, రక్షణ కరువై పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా కఠిన తరమైన చట్టాలు తీసుకొని వచ్చి వాటిని కచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బమ్మ, మల్లిక, కుమారి, గంగోజమ్మ, మహిళలు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందికి సూచనలు ఇస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలు లేకుండా చూడాలి : జెసి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో ఫ్రీహోల్డ్ భూములను గుర్తించి వాటిని పరిశీలించి అక్రమాలు జరగకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలో ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్‌ను జెసి తనిఖీ చేశారు. ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్ ప్రక్రియ పక్కాగా జరగాలని, ఎటువంటి తప్పులు లేకుండా చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. భూముల పరిశీలనలో తహశీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎన్‌ఎం అరుణకుమారికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి-గాలివీడు

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఎఎన్‌ఎంగా అవార్డు అందుకున్న వి.అరుణ కుమారికి అరుదైన గౌరవం దక్కింది. మండలంలోని నూలివీడు పిహెచ్‌సి పరిధిలో ఎఎన్‌ఎం విధులు నిర్వహిస్తున్న అరుణకుమారి కోవిడ్ సమయంలో అందించిన విశేష సేవలను గుర్తించి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విందులో ఆమె పాల్గొన్నారు. రాజ్ భవన్ అధికారుల ప్రత్యేక ఆహ్వానం మేరకు విశిష్ట అతిథులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లను కలిసి ఆమె పాల్గొన్నారు. ఆమెకు గౌరవం దక్కడం పట్ల తోటి ఉద్యోగులు,మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ ప్రతిభకు పురస్కారాలు

బి.కొత్తకోట ప్రశంసా పత్రం అందుకుంటున్న సిఐ సూర్యనారాయణ


సుండుపల్లి: అధికారుల నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎఇ రమేష్‌బాబు

మౌలిక వసతుల కల్పనకు కృషి : 'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కారూపానందరెడ్డి పేర్కొన్నారు. ఓబుల వారిపల్లె మండలం చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ చిన్న ఓరంపాడు లోని జూనియర్ కళాశాలలో సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసామని అన్నారు. ప్రతి గ్రామానికి రహదారుల నిర్మాణంకోసం సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశామని, త్వరలో పనులు మొదలు పెట్టడానికి తగు ఏర్పాట్లను చేస్తున్నామని పేర్కొన్నారు. జూనియర్ కళాశాలలో తరగతి గదుల కొరత ఉందని రెండు గదుల నిర్మాణం చేయించాలని కళాశాల ఉపాధ్యాయులు కోరగా రెండు కాదు, మూడు తరగతి గదుల నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ హరిత, పీడీ శారద, క్లర్క్ శివ ప్రసాద్, సర్పంచ్ గద్దె పెంచలయ్య, జడ్‌టిసి పి.లక్ష్మీ నరసయ్య, నాగ శివ శంకర్ రెడ్డి, పయ్యావుల కోటేశ్వర్ నాయుడు, గద్దె రమేష్ బాబు, జల్లి రాజేష్, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం : 'మండిపల్లి'

కార్యకర్తలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-కలకడ

తన గెలుపు కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.సంబేపల్లి మండలం ఎస్.సోమవారం, గుట్టపల్లి పంచాయతీలకు సరిహద్దుల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న ఒక ప్రత్యేక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఉన్న గుట్ట పల్లి రోడ్డు నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు కార్యకర్తలు, అబి. మానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా ఉండి వారి సమస్యలు పరిష్కరించడానికి ముందు ఉంటానని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్ర మాలను వెలికి తీసి శిక్ష పడేలా చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని తప్పక అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో గుట్టపల్లి, సోమవారం పంచాయతీల కార్యకర్తలు మాజీ ఎంపిటిసి ప్రభాకర్ నాయుడు, వేణుగోపాల్ నాయుడు, రాహుల్‌నాయుడు, చంద్రబాబు నాయు డు, కోట రమణ, ప్రభాకర్ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేస్తాం

- డిసిసిబి ఎజిఎం కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఇకపై మరింత బలోపేతం అవుతున్నట్లు డిసిసి బ్యాంక్ ఎజిఎం కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నిమ్మనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో తహశీల్దార్ ధనంజయులు, ఎంపిడిఒ రమేష్ బాబు, సిఇఒ హరినాద్‌రెడ్డి, డిసిసి బ్యాంక్ మేనేజర్ పవిత్రలతో కలిసి కంప్యూటైజెడ్ ప్రక్రియను పరిశీలించారు. సహకార సంఘంలోని రైతుల వివరాలను, లోన్ వివరాలను, రైతుల భూముల వివరాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 96 వేల వ్యవసాయ సహకార సంఘాలను మూడు లక్షల సహకార సంఘాలుగా పెంచడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2053 వ్యవసాయ సహకార సంఘాలను 100 రోజుల్లో అక్టోబర్ 2 నాటికి పూర్తిగా కంప్యూటైజెడ్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలోని, నిమ్మనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని పూర్తిగా కంప్యూటైజెడ్ చేయటానికి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. నిమ్మనపల్లి సహకార సంఘంలో 4961 ఖాతాలు ఉండగా 3873 ఖాతాలకు రైతుల నుంచి ఇకెవైసి ద్వారా ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. రైతుల రుణాల వివరాలు, వారి షేర్ క్యాపిటల్, భూముల వివరాలు వంటివి ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరుగుతుందని పేర్కొన్నారు. సింగిల్ విండో కార్యాలయాన్ని పూర్తిగా ఆన్‌లైన్ వ్యవస్థగా మార్చడానికి మం డల అధికారులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సహకార సంఘం సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, సింగిల్ విండో కార్యాలయ సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి, ధనంజయులు పాల్గొన్నారు.


ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డిసిసిబి ఎజిఎం, తహశీల్దార్, ఎంపిడిఒ

మదనపల్లి: వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

వైభవంగా వరలక్ష్మి వ్రతం

ప్రజాశక్తి-కలకడ

మండలంలో వరలక్ష్మి వ్రతం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దేవలంపేట లోని శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగదేవతలను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.గోపాలపురంలో వెలిసిన శ్రీషిరిడి సాయి బాబా ఆలయంలో వ్రతాన్ని జరుపుకున్నారు.అగ్రహారం నందు మహిళలు వరలక్ష్మీ వ్రతం సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. **నిమ్మనపల్లి :** వరలక్ష్మి వ్రత పర్వదినాన్ని పురస్కరించుకొనిమహిళలు భక్తి శ్రద్ధలతో అక్కదేవతలకు పూజలు చేశారు. శ్రావణ మాసంలో వచ్చే వరలక్ష్మీ వ్రత పర్వదినాన్ని పురస్కరించుకుని చల్లా వారిపల్లిలో మునిరాజా, రాజు దంపతులు అక్కదేవతల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉపవాస దీక్షతో మొక్కు తీర్చుకున్నారు. మండల సరిహద్దు ఎగువ మాచిరెడ్డిగారిపల్లి వద్దనున్న అక్కదేవతల ఆలయంలో పూజలు చేశారు. చల్లావారిపల్లి ఆలయం వద్ద దాతలు మునిరాజా, రాజు దంపతులు అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. **మదనపల్లి :**మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, కళాశాల స్థానిక రెడ్డెప్పనాయుడు కాలనీలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా లక్ష్మి పూజను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని ప్రముఖులు, మహిళలు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి మాట్లాడుతూ వర లక్ష్మి వ్రతానికి ఎంతో ప్రాధాన్యత ఉందని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రెసిడెంట్ నాదేళ్ల ద్వారకనాథ్, టిడిపి నాయకులు మార్పూరి సుధాకర్ నాయుడు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** మండలంలోని అన్ని ప్రాంతాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. ఉదయాన్నే పలు రకాల పిండి వంటలు, పండ్లు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి,అమ్మవారిని ఆభరణాలతో వివిధ రకాల పూలతో అలంకరించి నూతన వస్త్రాలను, ఆభరణాలను అమ్మవారి ముందు ఉంచి వ్రతాన్ని ఆచరించారు. **నందలూరు:** మండలంలోని మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఎవరి ఇళ్లలో వారు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, వివిధ రకాల నైవేద్యాలు నివేదించి, విశేష పూజలు నిర్వహించారు.

ప్రజలకు సేవ చేయడమే ధ్యేయం

- రొంపిచర్ల కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-పుల్లంపేట

నిరుపేదలకు అండగా నిలిచి వారికి సేవ చేయడమే తమ ధ్యేయమని రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ దివంగత మాజీ సర్పంచ్ రొంపిచర్ల ఆది నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి, చుట్టు పక్కల గ్రామాల్లో సమాజ సేవా కార్యక్రమాలు చేసుకుంటూ వసు న్నామని చెప్పారు. రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ రొంపిచర్ల ఆదినారాయణ రెండు పర్యాయాలు రెడ్డిపల్లి సర్పంచ్ గాను, ఒకసారి అనంతంపల్లి సింగిల్ విండో చైర్మన్ గాను ప్రజలకు సేవలు అందించి 2001లో మరణించారని అన్నారు. ఆయన పెద్ద కోడలు మల్లేశ్వరితో పాటు, నాలుగవ కుమారుడు మురళి ఆదినారాయణ సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కోడలు మల్లీశ్వరి 2014లో సర్పంచ్‌గా ఎన్నికై సేవలందించారు. మురళి 2014లో రెడ్డిపల్లి నీటి సంఘం చైర్మన్‌గా సేవలందించారు. రొంపిచర్ల కుటుంబం రెడ్డిపల్లి, టికమ్మపల్లి ఉమ్మడి పంచాయతీగా ఉన్న సమయంలో పంచాయితీ కార్యాలయానికి స్థలాన్ని దానం చేసినట్లు చెప్పారు. రెడ్డిపల్లి పేట గ్రామంలో పాఠశాలకు స్థలం ఇవ్వడమే కాక ఉచితంగా బోరు వేసి బస్టాండ్‌లో ప్రయాణికులు సేద తీరేందుకు సిమెంటు బల్లలు ఏర్పాటు చేశామని అన్నారు. రామాలయంలో కూడా సిమెంటు బల్లలు ఏర్పాటు చేశామన్నారు. రెడ్డిపల్లి గ్రామ పంచాయతీలు ఆర్థిక స్తోమత లేని పేదలకు వివాహానికి మంగళ సూత్రాలు అందించి నగదు రూపంలో సహాయ సహకారాలు అందజేయడం, మరణించిన పేద కుటుంబాల వారికి దహన సంస్కారాలకు గాను ఆర్థిక సాయం అందిస్తున్నామని అన్నారు. గ్రామపం చాయతీలో ఎవరికి ఏ సమస్య వచ్చినా ఆదుకుంటూ శక్తివంచన లేకుండా తమ సొంత నిధులతో సేవా కార్యక్రమాలు చేపడు తున్నా మన్నారు. రొంపిచర్ల ఆది నారాయణ వారసత్వాన్ని కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.

బస్సు షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన బల్లలు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తున్న రొంపిచర్ల కుటుంబ సభ్యులు

నేడు పీలేరులో వైద్య సేవలు రద్దు

ప్రజాశక్తి-పీలేరు

కోల్‌కత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్య కేసులో న్యాయం కోసం డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు వైద్య సేవలను రద్దు చేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి. చంద్రశేఖర్, డాక్టర్ పవన్ కుమార్ ప్రకటించారు. శుక్రవారం పీలేరుశాఖ ఆధ్వర్యంలో ప్రకటన విడుదల చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణ కోసం కేంద్ర రక్షణ చట్టం చేయాలని, ఆంధ్రప్రదేశ్ వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠిన తరం చేయాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో ఆర్‌జి కేర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9వ తేదీ రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా వైద్యురాలిపై అమానుషంగా సామూహిక అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన కేసులో సత్వర న్యాయం కోసం డిమాండ్ చేస్తూ, దానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న ఆర్‌జి కేర్ వైద్య కళాశాల ఆస్పత్రి విద్యార్థులు, వైద్యులపై ఆగస్టు 14వ తేదీ రాత్రి రౌడీమూకల దాడులను నిరసిస్తూ జాతీయ ఐఎంఎ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఎ శాఖలు ఇచ్చిన పిలుపుమేరకు శనివారం నుంచి 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేయాలని పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. పట్టణంలోని అన్ని ప్రయివేట్, ప్రభుత్వ ఆసుపత్రులలో, అత్యవసర సేవలు మినహా ఒపిడి సేవలు, అత్యవసరం కాని శస్త్ర చికిత్సలు పూర్తిస్థాయిలో నిలిపివేయడం జరుగుతుందని ఐఎంఎ పీలేరు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి, సిబిఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేసి, నేరానికి పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలని, ఆసుపత్రులలో డ్యూటీలో ఉన్న వైద్యులకు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక రక్షణ చట్టాలు కేంద్ర స్థాయిలో తీసుకురావాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠిన తరం చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు ఐఎంఎ పీలేరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ పి. చంద్రశేఖర్ కార్యదర్శి డాక్టర్ వై. పవన్ కుమార్, కోశాధికారి డాక్టర్ బి.ఈశ్వర్ సురేంద్ర తెలిపారు. ఈ నిరసన తర్వాత ప్రభుత్వాలు తీసుకునే చర్యలను బట్టి తదుపరి కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని, తమ డిమాండ్లు సాధించేవరకు ఈ ఉద్యమాన్ని ఆపేది లేదని, అవసరమైతే మరింత తీవ్రతరం చేస్తామని, వృత్తి నిర్వహణలో రక్షణ కల్పించమని అడుగుతున్న తమ న్యాయమైన డిమాండ్లకు ప్రజలు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పక్షాలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేసుకున్నారు.

రోడ్డుకు అడ్డుగా ఉన్న కంపచెట్లు

అడ్డుగా ఉన్న చెట్లను తొలగించండి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లె పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎగువ మాలపల్లి వరకు వెళ్లి మెటల్ రోడ్డులో ఇరుపక్కల కంపలు చెట్లు ఉండడంతో చాలా ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు రామయ్య, చిన్నప్ప, వెంకటేశులు తెలిపారు. ఈ దారి నుంచి ఏడు గ్రామాల కు చెందిన వాహన దారులు రాకపోకలుసాగిస్తుంటారని అడ్డుగా చెట్లు ఉండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలోనే రోడ్డు పనుల కోసం రూ.60 లక్షలు తారు రోడ్డు ప్రభుత్వం మంజూరు చేసిందని, కొంతమంది రాజకీయ నాయకుల స్వార్థంతో నిలిపి వేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకి ఇరుపక్కల ఉన్నటువంటి కంపచెట్లను తొలగించాలని కోరారు.

బి.కొత్తకోట తహశీల్దార్‌గా బి.శ్రీధర్‌రావు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్‌రావు

బి.కొత్తకోట మండల తహశీల్దారుగా బి.శ్రీధర్‌రావు బాధ్యతలు స్వీకరించారు.ఎన్నికల విధులకుగాను పుణ్యవతిని తహ శీల్దార్‌గా ఇక్కడ నియమిం చారు. తిరిగి ఆమెను అనంతపురానికి బదిలీ చేయడంతో ఆమె స్థానంలో బి.శ్రీధర్‌రావు నియమి తుల య్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని, రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి వారి శ్రేయస్సు కోసం పని చేస్తామని చెప్పారు.నూతన తహశీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వేకోడూరు సిఐగా పి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

బాధ్యతలు స్వీకరిస్తున్న సిఐ వెంకటేశ్వర్లు

రైల్వే కోడూరు సిఐగా పి.వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వెంకటేశ్వర్లు కోడూరు ఎస్ఐ పనిచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో మార్పులు చేర్పులలో భాగంగా సిఐగా పని చేస్తున్న సురేంద్రనాథ్‌రెడ్డి ని బదిలీ చేసి ఆయన స్థానంలో వెంకటేశ్వర్లను ప్రభుత్వం నియమించింది.

ఆయాలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ సెంటర్‌లో పనిచేస్తున్న అర్హులైన ఆయాలందరినీ టీచర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని, అలాగే టీచర్లు, ఆయాలకు బదిలీలు కల్పించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.మనోహర్ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యల మీద రాజీలేని పోరాటం సిఐటియు నిర్వహించిందని తెలిపారు. వాటి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం హెల్పర్స్‌కు 45 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు వయసు సడలించిందని పేర్కొన్నారు. అంగన్వాడీ యూనియన్, సిఐటియు పోరాటం నిర్వహించడం వల్ల సాధ్యమైందని తెలిపారు. కానీ కడప జిల్లాలో ప్రమోషన్స్ ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో ప్రమోషన్స్ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుని ప్రమోషన్స్ ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో చాలా సంవత్సరాలుగా హెల్పర్‌గా పని చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైనటువంటి హెల్పర్స్ చాలామంది జిల్లాలో ఉన్నారని తెలిపారు. ప్రమోషన్స్ ఇవ్వకపోవడం వల్ల వయసు పెరిగి నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో సంవత్సరం దాటినా ఇప్పటికీ ప్రమోషన్స్ ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీలు చేసిన వారు చాలామంది ఉన్నారని పేర్కొన్నారు. కనుక ఐసిడిస్ జిల్లా అధికారులు అర్హులైన వారికందరికీ వర్కర్స్ నుంచి టీచర్స్‌గా ప్రమోషన్స్ ఇవ్వాలని తెలిపారు. ఈ విషయాలన్నిటిపై సోమవారం కలెక్టర్‌ని కలుస్తామని పేర్కొన్నారు. టీచర్లను సూపర్‌వైజర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

రూ.10 నాణేలపై అవగాహన

ప్రజాశక్తి - కడప

రూ.10 నాణెం చెల్లుబాటు అవుతుందని ఆర్‌బిఐ అధికారికంగా ప్రకటించిందని అని కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ కే మురళీమోహన్ అన్నారు. కలెక్టర్ శివ శంకర్ లోతేటి సూచనల మేరకు శుక్రవారం కెనరా బ్యాంక్ వద్ద నాణేలపై చలామణి మేళా, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆర్ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణెం చెల్లుబాటుపై స్పష్టత ఇచ్చారు. తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని ఈ సందర్భంగా గుర్తు చేశారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి. జనార్ధనం మాట్లా డుతూ నాణెం చెల్లుబాటు అవుతుందని వాటిని అందరూ విరివిగా వాడాలని తెలిపారు. నాణేలను అన్ని రకాల లావా దేవీలకు వీటిని ఉప యోగించుకోవచ్చునని, ఎటువంటి ఆంక్షలు లేవని తెలిపారు. కార్యక్రమంలో వివిధ రకాల వ్యాపారులు పాల్గొని దాదాపుగా లక్ష రూపాయలు విలువ చేసే నాణేలను తమ వ్యాపార నిమిత్తం తీసుకున్నారు. కార్యక్ర మంలో కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ డివిజనల్ మేనేజర్ ఎస్. రమేష్, కడప మెయిన్ బ్రాంచ్ మేనేజర్ పి. మధుకర్, ఇతర శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లతో ఎస్ఇబి పోలీసు సిబ్బంది

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

- రూ.30 వేలు జరిమానా

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి రూ.30వేలు జరిమానా విధించినట్లు లక్కిరెడ్డిపల్లి ఎస్ఇబి ఇన్‌ఛార్జి ఎస్క్మి జబీబుల్లా పేర్కొన్నారు. మండల పరిధిలో వేర్వేరు చోట్ల అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం దాడి చేసి 12 టన్నుల ఇసుకతో సహా సీజ్ చేసినట్లు చెప్పారు. ట్రాక్టర్‌కు రూ.10వేలు చొప్పున రూ.30వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రామాపురం, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు మండలాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఇసుక కావాల్సిన వారు ముందుగా ప్రభుత్వ అనుమతి పొంది రవాణా చేసుకోవాలని తెలిపారు.